VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 292

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 7 ఏప్రిల్ 2026




## కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్కే మల్లికార్జున నియామకం





**పెనుకొండ,కలంకౌంటర్ :** రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడిగా నియమించబడిన రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన ఎస్కే మల్లికార్జున , పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత డ జౌళి శాఖల మంత్రి సవితమ్మ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ సందర్భంగా కురుబ సంఘం నాయకులు, సభ్యులు కూడా హాజరై మల్లికార్జున కి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి సవితమ్మ ఆకాంక్షించారు. అనంతరం ఎస్కే మల్లికార్జున మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కురుబ సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ ప్రత్యేక పూజలలో ప్రభుత్వ చీఫ్ విప్





**వినుకొండ,కలంకౌంటర్ :** వినుకొండ మండల మదమంచిపాడు గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి వారి తిరుణాల మహోత్సవంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న జీవీ కి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారికి జరిగిన ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయనకు అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రం మరియు ప్రసాదాన్ని అందజేశారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. జి.డి.సి.సి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ జాన్స్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం బంటుమిల్లి సెయింట్ జాన్స్ ఈఎం హై స్కూల్లో సోమవారం ఐదవ తరగతి విద్యార్థి నీ, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కూల్ కరస్పాండెంట్ సాబు జాన్ , ప్రధానోపాధ్యాయుని ఝాన్సీ సా బూ పాల్గొన్నారు. ఈ సెలబ్రేషన్లో విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి కరస్పాండెంట్ సాబూ జాన్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ అంటే ఒక విద్యార్థి తన విద్యాభ్యాసాన్ని స్కూలు, కాలేజీ ,లేదా యూనివర్సిటీలో విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు అధికారికంగా స్వీకరించే పవిత్రమైన వేడుక. ఇది సంవత్సరాల కృషి పట్టుదలకు, గుర్తింపుగా కుటుంబం అధ్యాపకుల సమక్షంలో జరుపుకునే ఒక మైలురాయి. దీనికి అభినందనలు గా సాధారణంగా విద్యార్థులు ప్రత్యేకమైన గౌన్లు ,టోపీలు ధరించి తమ విజయాలను జరుపుకుంటారన్నారు. దీనినే గ్రాడ్యుయేషన్ డే లేదా కాన్వకేషన్ లేదా కమెన్స్మెంట్ డే అని కూడా పిలుస్తారు అని సాబు జాన్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐదవ తరగతి ఉపాధ్యాయులు సరిత, జహీదా ,మనీ, పద్మ పాల్గొని విద్యార్థులకు సందేశాన్ని అందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# జలధారతో ప్రతీ ఎకరానికి నీరు

- నీరు ఉంటే... సంపద ఉన్నట్లే
- జల సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్
- రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ
- -యాడికి 'జలధార' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- నీటి భద్రత..సాగునీటి సంఘాల బాధ్యత యాప్ లాంచ్
- అమరావతికి చట్టబద్ధతపై సీమ ప్రజల హర్షం
- తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచిన సీఎం



























**తాడిపత్రి,కలంకౌంటర్ :** జలమే సంపద... దాన్ని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 'జలధార'తో రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేలా జలహారతి కార్యాచరణ చేపడదామని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా, యాడికిలో 'జలధార..నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత' అనే కార్యక్రమంలో పాల్గొని 100 రోజుల యాక్షన్ ప్లాన్ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. అనంతరం నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో రూపొందించిన యాప్ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ....నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని మ-ఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా నీటి భద్రత కోసమే పనిచేస్తున్నాం. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని నిల్వ చేయాలి..నిలబడిన నీటిని జలాశయంలో చేసేందుకు ప్రయత్నించాలి. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం లాంటి అనేక ప్రయత్నాలు చేసి ముందుకు వెళ్లాం. పంట కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాలకు వేశాం. ఎన్టీఆర్ జలసిరి ద్వారా ట్రెంచ్లు, నీరు చెట్టు, నీరు-మీరు, నీరు-ప్రగతి లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టాం. నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల లాంటి భాగస్వాములతో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం. అనంతపురం లాంటి ప్రాంతాల్లో కొన్ని ఏళ్లపాటు నీరే లేదు. నష్ట పోతున్న రైతులను ఆదుకోడానికి ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చింది కూడా టీడీపీనే. అనంతపురం జిల్లాలో నీటిని సద్వినియోగం చేసుకోవాలని డ్రిప్ ఇరిగేషన్ కార్యక్రమం తీసుకువచ్చాం. 90 శాతం మేర సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఇచ్చింది కూడా గతంలో మేమే. మైక్రో ఇరిగేషన్పై గతంలో ఇచ్చిన నివేదికే ప్రామాణికంగా మారి దేశంలో అంతా వినియోగించే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్లో రూ.1,031 కోట్లు వ్యయం చేస్తూ దేశంలో నెంబర్ వన్గా ఉన్నాం. డ్రిప్ ఇరిగేషన్ వల్లే రాయలసీమ హార్టికల్చర్ హబ్గా మారింది. హార్చికల్చర్లో దేశంలో అగ్రస్థానంలో ఉన్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**పూర్వోదయతో సీమ అభివృద్ధి..** రాయలసీమ అభివృద్ధికి ఒక ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నామని, కేంద్రం ప్రవేశపెట్టిన పూర్వోదయ పథకం ద్వారా రూ.30 వేల కోట్లు వస్తాయన్నారు. 'పెట్టుబడులు ద్వారా మరో రూ.70 వేల కోట్ల రాబట్టి అభివృద్ధి చేస్తాం. గడిచిన 21 నెలల్లో నీటి భద్రతా పరంగా చాలా మార్పులు వచ్చాయి. చెరువులు పెద్ద ఎత్తున నింపగలిగాం. జల సంరక్షణా చర్యల కారణంగా భూగర్భ జలాలను 1.92 మీటర్ల మేర అదనంగా పెంచగలిగాం. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్లుగా భూగర్భజలాలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే ఇప్పుడు 11 మీటర్లకే భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చాయి. చేపట్టిన భూసంరక్షణ చర్యల కారణంగా 2.2 మీటర్ల మేర జలాలు పెరగటం సంతోషం కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాల్లో దీనిని ఓ ప్రజాఉద్యమంగా చేపట్టి విజయం సాధించారు. ఈ ఉద్యమంలో ప్రజలందరికీ నేను తోడుగా ఉంటాను. జిల్లాలో 5.7 టీఎంసీల నీళ్లు అందుబాటులోకి వచ్చాయి. 20 వేలకుపైగా ఎండిన బోర్లలో నీరు అందుబాటులోకి వచ్చింది. ఒక్క జిల్లాలో రూ.96 కోట్ల మేర విద్యుత్ ఆదా అయ్యింది. భూగర్భజలాలు పెరగటం మూలంగా హరిత ప్రాంతం పెరిగింది. ఇవన్నీ సానుకూలమైన అంశాలు' అని ముఖ్యమంత్రి అన్నారు.

**రబీ, ఖరీఫ్కు సమృద్ధిగా నీరు..** వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతున, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా భూగర్భ జలాలు అందుబాటులో ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. తద్వారా రాష్ట్రంలో నీటి ఎద్దడి లేకుండా చేయవచ్చని అన్నారు. "రిజర్వాయర్లలో నీళ్లు నిండుగా ఉంటే ఎప్పటికప్పుడు మనం విని యోగించుకునే అవకాశం ఉంటుంది. శ్రీశైలం నీటిని వేర్వేరు చోట్ల ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి నీరు తెచ్చుకుంటున్నాం. రాష్ట్రం లోనూ, రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకూ నీరు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు, పరిశ్రమలకు 28, తాగునీటికి 158 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. మొత్తంగా 1300 టీఎంసీల వరకూ నీటి అవసరం ఉంటుంది. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకువచ్చాం. హంద్రీనీవా ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు తీసుకెళ్లాం. పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు తీసుకువచ్చి రబీకి, ఖరీఫ్కు ఇచ్చే నీటిని ఆదా చేసి శ్రీశైలం నుంచి రాయలసీమకు తరలించాం. భూమినే జలాశయంగా మార్చుకుని వినియోగించు కోవటం ద్వారా మెరుగైన నీటి నిర్వహణ చేపట్టవచ్చు. రబీ, ఖరీఫ్ పంటలు పూర్తి అయ్యాక కూడా ప్రస్తుతం మన రిజర్వాయర్లలో 65 శాతం నీటి నిల్వ ఉంది. దేశంలోనే అతితక్కువ వర్షపాతం పడే అనంతపురం జిల్లా కూటమి ప్రభుత్వం చూపిన చొరవ కారణంగా ఎక్కువ పండ్ల తోటలతో సంప న్నమైన ప్రాంతంగా మారిందని అన్నారు. గత పాల కులు విద్యుత్ ఛార్జీలు పెంచారని, రూ.1.24 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని అన్నారు. కూటమి వచ్చాక గత ప్రభుత్వం పెం చిన సుమారుగా రూ.4,400 కోట్ల భారాన్ని కూడా ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. అలాగే తొలిసారి విద్యుత్ ఛార్జీల ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**పిచ్చి ముదిరి మావిగన్ మాటలు..** గత పాలకులు రాష్ట్ర ప్రజలకు అడ్రస్ లేకుండా చేశారని, ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని సీఎం వ్యాఖ్యానించారు. 'గతంలో మూడు ముక్కలాట ఆడారు. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు అమరావతికి మద్దతు పలికారు. ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది. పిచ్చి ముదిరి మావిగన్ అంటూ కొత్తపేరు తీసుకొచ్చారు. అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారు. బాబాయిని చంపి నా చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారు. అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. చూసి సహించలేక ఫ్రస్టేషన్తో అవినీతి జరిగిందని అంటున్నారు. 2047 నాటికి ఏపీని అగ్రస్థానంలోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నాం. దీనికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశాం. ఉత్తరాంధ్ర నుంచి పశ్చిమ గోదావరి వరకూ విశాఖ, ప్రకాశం-నెల్లూరు వరకూ అమరావతి, తిరుపతి కేంద్రంగా రాయలసీమ ప్రాంతాల్లో అభివృద్ధి రీజియన్లుగా తయారవుతాయి' అని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పెట్టుబడులు వస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారు..** గత పాలకులు రాష్ట్రంపై పగపట్టారని, రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రతీ జిల్లాను అభివృద్ధి చేస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత ప్రభుత్వనిదే. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ఎదురు దాడి చేస్తున్నారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదం నాణ్యతను దెబ్బతీశారు. కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారు. రాష్ట్రంపై విద్వేషం చూపించే వారికి సహకరిస్తే పౌరులందరికీ నష్టం కలుగుతుంది. పెట్టుబడులు తీసుకువస్తుంటే వారిని బెదిరిస్తున్నారు. ఇలాంటి వారిని దూరం పెట్టాలి. కరెంటు, నీరు లాంటి దీర్ఘకాలిక సమస్యలను క్రమంగా పరిష్కరించుకుందాం. అందరికీ సమర్థవంతమైన, జవాబుదారీ పాలన ఇవ్వాలన్నదే మా లక్ష్యం. రాష్ట్రమే నా కుటుంబం. అందరికీ న్యాయం చేసే బాధ్యత మాది. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ పథకాల ద్వారా చేయూత అందిస్తున్నాం. పెట్టుబడులు వస్తే.. ఆదాయం వస్తుంది అప్పుడే సంక్షేమం చేయగలం. సుపరిపాలనకు ప్రజలంతా సహకరించాలని' చంద్రబాబు విజ్ఞప్తి చేస్తున్నాను.

**ప్రజల ముందే ప్రజంటేషన్..** అనంతపురం జిల్లా, తాడిపత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గ ప్రోగ్రెస్ రిపోర్ట్ను యాడికి జలధార సభలో ముఖ్యమంత్రి చదవి వినిపించారు. వివిధ శాఖల పనితీరు నివేదికలను ప్రజల ముందు ప్రజెంట్ చేశారు. సరిగ్గా పనితీరు కనబరచని వివిధ శాఖలకు చెందిన అధికారులను వేదికపైకి పిలిపించి వివరణ అడిగారు. పనితీరును మెరుగు పర్చుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తామని... అధికారులు, ఉద్యోగులు కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. భూవివాదాలనేవి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ట్రాక్టర్లల్లో ఇసుక తీసుకెళ్తున్నప్పుడు ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారా..? అని ప్రజలనే నేరుగా సభలో సీఎం అడగ్గా... ఎవ్వరూ అడ్డుకోవడం లేదని ప్రజలు బదులిచ్చారు. దీనికి సీఎం స్పందిస్తూ...ఆదాయం తగ్గినా పర్వాలేదనుకుని ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామన్నారు.బాగా పని చేసిన అధికారును అభినందించాలంటూ ప్రజలతోనే సభలో చప్పట్లు కొట్టించారు. ఉద్యోగుల పనితీరు ఆధారంగా సూపర్ అచీవర్స్.. అచీవర్స్.. పెర్ఫార్మర్స్.. లెర్నర్స్ గా విభజిస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో...ఇకపై తాను వచ్చే ప్రతీ సభకు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం హాజరవ్వాలని ఆదేశించారు.

**జై అమరావతి అంటూ నినాదాలు..** ముఖ్యమంత్రి చంద్రబాబు జలధార కార్యక్రమంలో ప్రజావేదిక సభకు వచ్చేముందు ప్రజలు జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని అమరావతికి పార్లమెంట్ చట్టబద్ధత కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్వయంగా అమరావతి లోగో పట్టుకుని సభకు జేసీ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. యాడికిలో సీఎం హెలిక్యాప్టర్ దిగాక అమరావతి బ్యాడ్జిని అందించారు. సభలో రాజధానికి చట్టబద్ధతపై హర్షం వ్యక్తం చేస్తూ ప్లకార్డులు, జెండాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని వ్యాఖ్యానించారు. వైసీపీ ఓ దిక్కుమాలిన పార్టీ అంటూ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రం మీద పగ పట్టినట్టు వైసీపీ వ్యవహరిస్తోందన్నారు. ఫ్యాక్షనిస్టులు, ముఠా నాయకుల కంటే ఘోరంగా రాష్ట్రాభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని దుయ్యబట్టారు. సభ అనంతరం పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత ఆమోదానికి గుర్తుగా సీఎంకు అమరావతి జ్ఞాపికను జేసీ పవన్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, స్థానిక ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, ఎంపీలు, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగానికి ముందు ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. నీటి సంరక్షణకు అనంతపురం జిల్లా, నియోజకవర్గంలో చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి వివరించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్కు సంబంధించిన వివరాలను ఫొటో ఎగ్జిబిషనులో అధికారులు ప్రదర్శించారు. డ్వాక్రా, స్థానిక మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్ను, గ్రానైట్, డొలమైట్, సున్నపురాయి గనులకు సంబంధించిన స్టాల్ ను సందర్శించారు. హార్టికల్చర్ ఉత్పత్తులను కూడా సీఎం చంద్రబాబు పరిశీలించారు.

# మీ రక్షణ కోసమే హెల్మెట్ - జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్




**బాపట్ల,కలంకౌంటర్ :** ద్విచక్ర వాహనాలపై ప్రతి ఒక్కరు తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని హెల్మెట్ ధరించి ప్రయాణించాలని జిల్లా ఎస్పి బి.ఉమామహేశ్వర్ తెలిపారు. "శిరో రక్ష – ప్రాణ రక్ష" కార్యక్రమంలో భాగంగా చీరాల సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో సోమవారం చీరాలలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాన్ని నడిపారు. గడియార స్తంభం సెంటర్ నుండి ప్రారంభమై బస్ స్టాండ్ సెంటర్, రైల్వే స్టేషన్, ముక్కోనపు పార్క్, మున్సిపల్ ఆఫీస్, బాయ్స్ హై స్కూల్, ముంతా వారి సెంటర్, నల్ల గాంధీ బొమ్మ, కోట్ల బజార్, కూరగాయల మార్కెట్ మీదుగా చీరాల 1టౌన్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ద్విచక్ర వాహన ర్యాలీలో సుమారు 150 మంది పోలీస్ సిబ్బంది హెల్మెట్ దరించి పాల్గొన్నారు. ర్యాలీ ముగిసిన అనంతరం జిల్లా ఎస్పీ గారు పోలీస్ అధికారులు సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణను చెప్పటం జరిగిందన్నారు. ఇందులో భాగంగా "శిరోరక్ష – ప్రాణరక్ష" అనే కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. రోడ్డు ప్రమాదాల సరళిని విశ్లేషిస్తే చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారిలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు ఎక్కువ శాతం మంది ఉన్నారన్నారు. దీనికి ప్రధాన కారణం తలకు తగిలే గాయాలేనన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తే అది తలకు తగిలే గాయాల నుండి రక్షణ కల్పిస్తుందన్నారు. తద్వారా ప్రణాపాయం నుండి బయటపడే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు, ఉద్యోగులు, పాత్రికేయులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు అందరూ స్వయంగా హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొంటూ ఈ మార్పును తమ నుండే మొదలుపెట్టామన్నారు. కేవలం జరిమానాలలు విధిస్తారని కాకుండా, తమ కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. రానున్న 10 నుంచి 15 రోజుల పాటు విద్యార్థులు, యువత, ప్రజలకు హెల్మెట్ ఆవశ్యకత, రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. తరువాత నుండి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాపట్ల జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చడానికి ప్రజలందరూ సహకరించాలని, " శిరోరక్ష ప్రాణరక్ష" అని ఎస్పీ నినదించారు. ఈ కార్యక్రమాలు ముఖ్య ఉద్దేశం ప్రజల్ని ప్రాణాపాయం నుండి బయట పడవేయటమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ఎమ్.డి.మోయిన్, చీరాల 1టౌన్ సిఐ ఎస్.సుబ్బారావు, టూ టౌన్ సీఐ అశోక్ కుమార్, రూరల్ సీఐ శేషగిరి, ఇంకొల్లు సీఐ రమణయ్య, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నెలాఖరులోగా వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయండి

## –జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్




**నరసరావుపేట,కలంకౌంటర్ :** ఈ నెలాఖరులోగా పిడుగురాళ్ల వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని మేఘా ఇంజనీరింగ్ కాంట్రాక్టును రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. కళాశాల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం, అధికారుల నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం పిడుగురాళ్ల వైద్య కళాశాల నిర్మాణపనులపై మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసులు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పిడుగురాళ్ల రాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రభుత్వ వైద్య కళాశాలగా రూపుదిద్దుకోనుందన్నారు. మెడికల్ కళాశాల, ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే పల్నాడు జిల్లా ప్రజలతో పాటూ మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల ప్రజలకు సైతం అనుకూలంగా ఉంటుందన్నారు.

**విద్యుత్ బిల్లులు తగ్గించాం..** చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ట్రూ డౌన్ విధానం తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గించామని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎస్సీ,ఎస్టీల గృహాలకు సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పింఛన్లు ఏకబిగిన రూ.4,000 కు పెంచడం, కుటుంబంలోని పిల్లలందరికీ తల్లికి వందనం, రాజధాని అమరావతికి చట్టబద్ధత, మెడికల్ కాలేజీల నిర్మాణాలు, రహదారుల నిర్మాణం, సాగు నీటి కాల్వల మరమ్మతులు, రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా చేయడం వంటి కార్యక్రమాల ద్వారా సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత పాటిస్తున్నామన్నారు.

**ఏప్రిల్ 30 నాటికి పూర్తి స్థాయిలో సిబ్బంది : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా..** ఏప్రిల్ ఆఖరు నాటికి వైద్య కళాశాలలో పూర్తి స్థాయి సిబ్బంది



పని చేయనున్నారని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు. ఇప్పటికే పరిపాలన యంత్రాంగం, 10 మంది వైద్య సిబ్బంది, 50 నర్సులు, పారిశుద్ధ్య నిర్వాహకులు వైద్య కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. మే మొదటి వారంలో ఆసుపత్రిలో 12 శాఖలకు సంబంధించిన ఓపీ ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించుకునేందుకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఫేజ్ 2 లో స్పెషలిస్టు సేవలు సైతం అందుబాటులో వస్తాయన్నారు. వైద్య కళాశాల నిర్మాణంతో పల్నాడు జిల్లా వాసులు వైద్య సేవల కోసం గుంటూరుకో, హైదరాబాద్ కో వెళ్లాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రంలో మూడు ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి కానుందని, మరో 14 మెడికల్ కాలేజీలు పీపీపీ విధానంలో అందుబాటులోకి తెస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు.

# నారా లోకేష్ తో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భేటీ

## •కందుకూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ

**కందుకూరు,కలంకౌంటర్ :** రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో... కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం విజయ–వాడలోని ఉండవల్లిలో భేటీ అయ్యారు.కందుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, ఇతర కార్యక్రమాల గురించి లోకేష్ కి నాగేశ్వరరావు వివరించారు. అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు ఇస్తుండడంపట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా పెండింగ్ లో ఉన్న పనుల గురించి ప్రస్తావించిన నాగేశ్వరరావు... వాటికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్స్ పంపిణీ

## –జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు బ్యాగు, హ్యాట్ మరియు వాటర్ బాటిల్ తో కూడిన సమ్మర్ కిట్స్ ను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – వేసవి కాలంలో మండుటెండలో ట్రాఫిక్ విధులు నిర్వహించడం చాలా కష్టంతో కూడుకున్నదన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే వేళలను మినహాయించి, ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది పని గంటలను మార్పులు చేయాలని ట్రాఫిక్ సిఐని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అదే విధంగా ప్రజలకు నిరంతరం సేవలందించడంతోపాటు, తమ ఆరోగ్యంపై కూడా ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని, తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వేసవిలో ఎండ తీవ్రతను ఎదుర్కొనేందుకు, డీహైడ్రేషన్ కు గురికాకుండా తరుచూ మంచి నీళ్ళు, మజ్జిగ, ఓ.ఆర్.ఎస్, గ్లూకోజ్ ను త్రాగాలని, కళ్ళకు చలువ కళ్ళద్దాలను ధరించాలని, ఎండ వేడిని తట్టుకొనే విధంగా రూపొందించిన షూలను మాత్రమే ధరించాలని పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. ఎండ తీవ్రతను, నిర్వహించాల్సిన పోలీసు విధులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు నిరంతరం పోలీసులు సేవలందించాలన్నారు. వేసవి కాలం అంతా పోలీసు సిబ్బందికి మజ్జిగ, కూలింగు వాటర్, ఎలక్ట్రోలర్ లేదా గ్లూకోజ్ పౌడర్ ను ట్రాఫిక్ సిబ్బందికి ప్రతీ రోజూ అందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అదే విధంగా ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్స్ వద్ద వాహనదారులు ఎక్కువ సమయం ఎండలో వేచి ఉండకుండా సిగ్నల్ టైమింగ్సు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సిఐకి జిల్లా ఎస్పీ సూచించారు. యూనిఫామ్ ధరించి, విధులు నిర్వహించే పోలీసుల పని తీరును ప్రజలు ఎప్పుడు గమనిస్తుంటారన్నారు. కావున, ప్రతీ ఒక్కరూ నీట్ యూనిఫాం, మంచి షూలను ఎల్లప్పుడు ధరించాలని ట్రాఫిక్ సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. సక్రమంగా విధులు నిర్వహిస్తే, పోలీసుల పని తీరును ప్రజలు ప్రశంసిస్తారన్నారు. కావున, విధులు నిర్వహించే సమయంలో పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని, చక్కని పని తీరుతో పోలీసు వ్యవస్థకు మంచి పేరు తీసుకొని రావాలని పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ దిశా నిర్దేశం చేసారు. వేసవిలో తీవ్ర ఎండల నుండి కాస్తా ఉపశమనం పొందడానికి సుమారు రూ.1లక్ష విలువైన హ్యాట్స్, వాటర్ బాటిల్, బ్యాగుతో కూడిన సమ్మర్ కిట్స్ ను ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసే, ఎఎస్ఐలు, హెచ్సీలు, కానిస్టేబుళ్ళు , హటరీంగార్డులకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అందజేసారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డి ఎస్పీ ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్బి సిఐ ఎ.వి. లీలారావు, ట్రాఫిక్ ఎస్ఐలు ఎస్.భాస్కరరావు, చిన్నారావు మరియు ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు - కమిషనర్ ఎన్. మౌర్య




**తిరుపతి,కలంకౌంటర్ :** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 36 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 5 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా రవీంద్ర నగర్ నందు త్రాగునీటి పైప్ లైన్ వేశారు నీటి సరఫరా చేయాలని, యూడిఎస్ లైన్ మరమ్మత్తు చేయాలని, తాను ఇల్లు విక్రాయించలేదు అయినా వేరొకరి పేరు మీరు పన్ను వస్తోంది పరిష్కరించాలని, కొర్లగుంట మారుతీ నగర్ లో తన స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారు పరిష్కరించాలని, తాతా నగర్ వద్ద ఖాళీ జాగాలో చెత్త వేస్తున్నారు పరిష్కరించాలని, ఇందిరా మైదానం వద్ద టెంకాయల వ్యాపారి వ్యర్థాలను వేయడం వలన ఇబ్బందిగా ఉందని, గాలి వీధి లో అపరిశుభ్రతను పరిష్కరించాలని, ఇందిరామైదానం వద్ద చెత్త తొలగించాలని, గొల్లవాని గుంట నందు సిసి రోడ్లు, కాలువలు వేయించాలని, ఇంటికొసం డబ్బులు కట్టాము తిరిగి ఇప్పించాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.




**ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడి పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు**

–ఒంగోలు,కలంకౌంటర్ :



# వైభవంగా కోదండ రాముని చక్రస్నానం

**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పెద్ద బజార్ శ్రీ కోదండ రామాలయంలో బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం ఎంతో వైభవంగా చక్రస్థానం నిర్వహించారు. టీటీడీ వేద పండితులు శ్రీమాన్ గుడివర్తి వెంకట దీక్షితులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అనిల్ స్వామి, పవన్ స్వామి ఎంతో వైభవంగా భక్తుల మధ్య చక్రస్థానం ఎంతో వైభవంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీ కోదండ రామస్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొనిజేటి రవికుమార్, అనిల్ కుమార్ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారి శెట్టి శ్రీను, వైఎస్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, కోశాధికారి అప్పుల మధు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



# సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నిత్య అన్నదానానికి విరాళం



**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా మోపిదేవి గ్రామంలో స్వయంభు దేవాలయంగా బిరుదులుతున్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి ఘంటసాల మండలం, చిట్టూరు గ్రామం వాస్తవ్యులు జి. వెంకటరమణ, పార్వతి దంపతులు అన్నదానం నిమిత్తం 1,00,116 రూపాయలు నగదు రూపంలో ఆలయ సూపర్నెంట్ అచ్యుత మధుసూదన్ రావుకి సోమవారం విరాళంగా అందజేశారు.వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

# విశాఖలో గూగుల్ డేటా సెంటర్... ఈ నెల 28న చంద్రబాబు శంకుస్థాపన

**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్కు మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్.. విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 28న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ కూడా హాజరుకానున్నారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీ ఇన్ఫ్రా సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ఈ డేటా సెంటర్ కోసం మొత్తం 15 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.27 లక్షల కోట్లు) పెట్టుబడిగా పెట్టనున్నారు. దీనిని 1000 మెగావాట్ల సామర్థ్యంతో అభివృద్ధి చేయనున్నారు. శంకుస్థాపన అనంతరం నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమవుతాయి. ఈ భారీ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విశాఖ పరిధిలోని మూడు ప్రాంతాల్లో 601.4 ఎకరాల భూమిని కేటాయించింది. వీటిలో తర్లువాడ, రాంబిల్లి, అడవివరం ప్రాంతాలు ఉన్నాయి. ప్రస్తుతం తర్లువాడలో స్థలాన్ని చదును చేసే పనులు కూడా జరుగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం, ఈ ప్రాజెక్టును 2028 జులై నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖ నగరం టెక్ హబ్గా మరింత అభివృద్ధి చెందడంతో పాటు, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఐటీ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొంటారని తెలుస్తోంది.



